

జోరుగా కోడి పందేలు

పెనుబల్లి మండలం గంగదేవిపాడులో జోరుగా కోడి పందేలు సాగుతుండగా.. రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్లు సమాచారం. 8లో



... చట్టబద్ధత కల్పించాలి

ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంపై పాలకులు దృష్టి సారించాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ డిమాండ్ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈనెల 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీకి చెందిన డిగ్రీ అర్హత అభ్యర్థులు ఈనెల 10వ తేదీ వరకు www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. వీరిలో 16న నిర్వహించే పరీక్ష ద్వారా 100 మందిని ఎంపిక చేయడంతో పాటు 50 మందిని నేరుగా ఎంపిక చేసి ఈనెల 31 నుండి వచ్చే ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో వసతి, ఇతర ఖర్చుల కోసం నెలకు రూ.5 వేలు చెల్లించడమే కాక మరో రూ.5 వేల విలువైన స్టడీ మెటీరియల్‌గా అందిస్తారు. ఈమేరకు దరఖాస్తు, శిక్షణ వివరాలు తెలుసుకునేందుకు 08742-227427, 95738 59598 నంబర్లలో సంప్రదించాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత ఓ ప్రకటనలో సూచించారు.

రైతులు, ప్రజలకు నష్టం జరిగితే సహించేది లేదు..

● ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: ప్రజల, రైతులకు నష్టం కలిగించేలా ఉన్న డోర్నకల్ – మిర్యాలగూడ రైల్వే లైన్‌ను జిల్లాలో అనుమతించే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నామ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో స్టడీ టూర్‌కు వెళ్లిన జిల్లా ప్రజాప్రతినిధులు శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాకు ఉపయోగం లేని ఈ లైన్‌ను బయట నుంచి నిర్మిస్తే అభ్యంతరం లేదని ఇప్పటికే ఉన్నతాధికారులకు వివరించానని పేర్కొన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనూ ఈ విషయాన్ని ప్రస్తావిస్తానని తెలిపారు. జాతీయ రహదారులు, ఇతరత్రా నిర్మాణాలతో రైతులు విలువైన భూములను కోల్పోగా, మళ్లీ రైల్వేలైన్‌తో నష్టం జరిగే అవకాశమున్నందున రైతులు, ప్రజల తరఫున ఆందోళనలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎంపీ హామీ ఇచ్చారు.

58, 59 జీఓ దరఖాస్తులపై విచారణ



దరఖాస్తులను పరిశీలిస్తున్న సీఈఓ అప్పారావు

సత్తుపల్లిరూరల్: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని క్రమబద్ధీకరణ కోసం 58, 59 జీఓల ద్వారా ప్రజలు చేసుకున్న దరఖాస్తులపై విచారణ కొనసాగుతోంది. ఈమేరకు సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో దరఖాస్తుల విచారణను శుక్రవారం జెడ్పీ సీఈఓ అప్పారావు పరిశీలించారు. ఇంటి సరిహద్దులు, కొలతలు, ఇంటి పన్నుల రశీదులను పరిశీలించిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. ఎంపీడీఓ సీహెచ్.సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.చైతన్య పాల్గొన్నారు.

నేడే వైఎస్సార్ విగ్రహావిష్కరణ

● హాజరుకానున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



వైఎస్సార్ విగ్రహం

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి సమీపాన వైఎస్సార్ టీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ఆవిష్కరిస్తారని పార్టీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తయారుచేయించిన 26 అడుగుల భారీ విగ్రహం ఆవిష్కరణ, రక్తదాన శిబిరం ఉంటుందని చెప్పారు. పార్టీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు తరలిరావాలని కోరారు.

మేధోమథన సదస్సుకు వైరా రైతు



రాణాప్రతాప్

వైరా: నీతి ఆయోగ్, ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న మేధోమథన సదస్సుకు వైరాకు చెందిన రైతు తుమ్మల రాణాప్రతాప్ ఎంపికయ్యారు. న్యూఢిల్లీలో శనివారం ఈ సదస్సు జరగనుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా సంస్థ విస్తరణ సలహా మండలి సభ్యుడైన రాణాప్రతాప్ సదస్సులో ప్రసంగించనున్నారు.

మత్తులో వీరంగం



● గంజాయి, మద్యానికి బానిసలవుతున్న యువత
● రాత్రయితే చాలు ఇష్టారీతిన వ్యవహరిస్తూ హల్‌చల్
● పోలీస్ నిఘా కొరవడడమే కారణమని విమర్శలు
● తాజాగా గంజాయి మత్తులోనే పంపింగ్‌వెల్ రోడ్డులో హత్య

సాక్షిప్రతినిధి, ఖమ్మం: యువత మద్యం, గంజాయి మత్తులో జోగుతోంది. ఈ మత్తులో ఏం చేస్తున్నారో తెలియకుండా ప్రవర్తిస్తున్నారు. ఈ క్రమంలోనే దాడులు, హత్యలు జరుగుతుండడం జిల్లా వాసులను బెంబేలెత్తిస్తోంది. ఇటీవల గంజాయి అక్రమ రవాణా ఊపందుకుంది. ఎక్కడపడితే అక్కడ గంజాయి లభిస్తుండడంతో యువత మత్తుకు బానిసవుతోంది. ఇటీవల గంజాయి, మద్యం మత్తులో ఖమ్మం నగరంలో ముగ్గురు హత్యకు గురయ్యారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇదే కోవలో గురువారం అర్ధరాత్రి సమయంలో పంపింగ్‌వెల్ రోడ్డులో చిన్నపాటి వివాదానికే గంజాయి మత్తులో ఉన్న అఖిల్.. సాయిపవన్, సాయిపై కత్తితో దాడి చేయగా సాయిపవన్ అక్కడికక్కడే మృతి చెందాడు.

అర్ధరాత్రి హల్‌చల్

గంజాయికి బానిసలుగా మారిన కొందరు యువకులు జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి హల్‌చల్ చేస్తున్నారు. బ్యాచ్‌లుగా విడిపోయి వాహనాలపై తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కొందరు ఆకతాయిలు పుట్టినరోజు వేడుకల పేరుతో శివారు ప్రాంతాలు ఖాళీ ప్రదేశాల్లో మద్యం, గంజాయి తాగుతూ, కేక్‌లు కట్ చేస్తూ బాణసంచా కాలుస్తున్నారు. దీంతో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవేళ ఎవరైనా తమకు ఇబ్బందిగా ఉందని ప్రశ్నిస్తే మత్తులో ఉన్న వారు దాడులకు వెనుకాడడంలేదు. ఇంటివద్ద తల్లిదండ్రులు పట్టించుకోకపోవడంతో ఇలా పలువురు మత్తులో మునిగితేలుతుండగా.. కొందరు నాయకుల అండతోనూ పేట్రేగిపోతున్నట్లు సమాచారం.

నిఘాకు గ్రహణం

ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇటీవల వరుసగా అరాచకాలు జరుగుతున్నా పోలీస్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్లపై ఘర్షణలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకుండా వెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గొడవ జరుగుతోందని డయల్ 100కు కాల్ చేసినా వారు వచ్చేలోగా అంతా అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రౌడీమూకలు, అరాచక శక్తులకు గతంలో పోలీసులంటే భయం ఉండగా.. ఇప్పుడు అలాంటిదేమి లేకపోవడంతో కొన్నిసార్లు పోలీసుల ఎదుటే ఘర్షణకు దిగుతున్నారని సమాచారం. గురువారం అర్ధరాత్రి ఖమ్మంలోని పంపింగ్‌వెల్ రోడ్డులో జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనమనే విమర్శలున్నాయి. గంజాయి మత్తులో ఉన్న సుందరయ్య నగర్‌కు చెందిన అఖిల్ పంపింగ్ వెల్‌రోడ్డుకు చెందిన కొప్పుల సాయిపవన్, సాయిపై చిన్నపాటి విషయానికే దాడికి పాల్పడ్డాడు. దాడి చేస్తున్న వ్యక్తికి అశోక్ సహకరించడంతో సాయిపవన్ కత్తి పోట్లకు గురై ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. పోలీసులు రాత్రివేళ పెట్రోలింగ్ చేస్తున్నట్లు చెబుతున్నా ప్రధాన రహదారులకే పరిమితమవుతోందని సమాచారం. శివారు కాలనీలు, నిర్మానుష్య ప్రాంతాల వైపు వెళ్లకపోవడంతో ఆకతాయిలు అవే ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గొడవలకు దిగుతున్నారు. ప్రధానంగా ఎక్కడ పడితే అక్కడ లభిస్తున్న గంజాయికి అడ్డుకట్ట వేయకపోతే మరిన్ని ఘటనలు జరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇటీవల జరిగిన ఘటనల్లో కొన్ని..

- బోనకల్ క్రాస్‌రోడ్డులో ఐదు నెలల క్రితం మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణ జరిగింది. అందులో ఒకరు కత్తెరతో స్నేహితుడిని పొడవగా మృతి చెందాడు.
- నాలుగు నెలల క్రితం ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు గంజాయి సేవించాక పెట్రోల్ కోసం గొడవ ప్రారంభమైంది. పాత బస్టాండ్ వద్ద ఒకరు మరొకరిపై ద్విచక్ర వాహనంలో ఉన్న పెట్రోల్‌పోసి తగల పెట్టాడు.
- గత ఏడాది బోగంకుంట బజార్‌లో గంజాయి మత్తులో ఉన్న స్నేహితుల మధ్య ఘర్షణ జరగగా, ఆ మత్తులో ఒకరు ఇంకొకరిని కత్తితో పొడవడంతో మృతి చెందాడు.
- ఖమ్మం పంపింగ్‌వెల్ రోడ్డులో గంజాయి సేవించే వారు ఖాళీ ప్రదేశాల్లో కూర్చుని గొడవలకు దిగుతున్నారు. ఇదేమిటని అడిగిన వారిపై దాడి చేస్తున్నారు.
- ఖమ్మం శివారు వెంచర్‌లో అర్ధరాత్రి పుట్టిన రోజు వేడుక చేసుకుంటున్న యువకులకు యజమాని మందలించడంతో దాడి చేశారు.
- నెల క్రితం ఖమ్మం రైల్వే మధ్య గేటు ప్రాంతంలో కొందరు అల్లరి మూకలు అర్ధరాత్రి సమయాన గంజాయి మత్తులో వచ్చిపోయే వారిని బెదిరించి సెల్‌ఫోన్లు, నగదు లాక్కోవడమే కాక దాడులు చేస్తున్నారు. ఈఘటనపై ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం.

సత్తుపల్లి ఆర్టీసీ డిపో అరుదైన ఘనత

● రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ఉత్తమ డిపోగా ఎంపిక
● బెస్ట్ బస్టాండ్‌గా సత్తుపల్లి



ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నుంచి అవార్డు అందుకుంటున్న డీఎం రాజ్యలక్ష్మి, ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపో రాష్ట్ర స్థాయిలో 2022–23 సంవత్సరానికి గాను ద్వితీయ ఉత్తమ డిపోగా నిలిచింది. అలాగే, బీ–క్లాస్ కేటగిరీలో బెస్ట్ బస్టాండ్ అవార్డు దక్కింది. ఈమేరకు తాజాగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, ఎస్ఎం గడ్డెం శ్రీనివాసరావు, కండక్టర్లు, డ్రైవర్లు ట్రోఫీతో పాటు రూ.2.50 లక్షల నగదు బహుమతి అందుకున్నారు.

నష్టం నుంచి లాభాల్లోకి...

సత్తుపల్లి ఆర్టీసీ డిపో 2021–22లో రూ.18 కోట్ల మేర నష్టాల్లో ఉంది. కానీ నష్టాలు తగ్గిపోగా 2022–23లో రూ.70 లక్షల లాభాలను ఆర్జించింది. కండక్టర్ లింగమూర్తి అత్యధిక ఈపీకే 50.61 సాధించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ కండక్టర్ అవార్డు అందుకున్నారు. అలాగే, దసరా ఛాలెంజ్‌లో పండుగకు వారం ముందు, వారం తర్వాత డ్రైవర్ బి.కిషోర్, కండక్టర్ జి.మురళి అత్యధిక ఆదాయం సాధించి అవార్డులకు ఎంపికయ్యారు. ఇక బస్టాండ్ పరిధిలోని 97 షాపుల ద్వారా నెలకు రూ.9.80 లక్షల ఆదాయం వస్తుండగా బకాయిలు లేకుండా పూర్తి స్థాయి అద్దె వసూళ్లతో ఉత్తమ బస్టాండ్‌గా నిలిచింది. ఈసందర్భంగా డీఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ డిపోలోని కండక్టర్లు, డ్రైవర్లు, ఉద్యోగుల సమష్టి కృషితోనే అత్యధిక ఆదాయం సాధించి అవార్డు పొందగలిగామని తెలిపారు.

సైబర్ ముఠా కలకలం

● డీసీసీబీ ఏటీఎంల్లో వరుస చోరీలు
● రూ.11లక్షలకు పైగానే నగదు స్వాహా
● ఎవరి ఖాతాల్లో డబ్బు పోకుండా మాయం
● హర్యానా, కేరళ ముఠాలు వచ్చినట్లుగా అనుమానాలు



ఓ ఏటీఎం వద్ద నిందితుడిగా భావిస్తున్న వ్యక్తి

ఖమ్మంక్రైం/వైరా/పెనుబల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న డీసీసీబీ ఏటీఎంల్లో సుమారు రూ.11 లక్షల వరకు నగదు స్వాహా అయినట్లు తెలియడం అటు బ్యాంకు వర్గాలతో పాటు ఇటు పోలీసు శాఖలో కలకలం కలిగించింది. గతంలో ఏటీఎంలను పగులగొట్టి చోరీ చేసిన ఘటనలు ఉన్నాయి. కానీ అందుకు భిన్నంగా కార్డుల ద్వారా ఎవరి ఖాతాల్లో నగదు విత్‌డ్రా కాకుండానే డబ్బు స్వాహా చేయడం గమనార్హం. ఏటీఎంలను ట్యాంపరింగ్ చేసి ఈఘటనలకు పాల్పడిన వారు హర్యానా, కేరళ ముఠా సభ్యులు కావొచ్చని ప్రాథమిక అంచనాకు వచ్చిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఒకరు, ఇద్దరుగా విడిపోయి

జిల్లాలో హర్యానా, కేరళకు చెందిన సైబర్ ముఠాలు సంచరిస్తున్నాయని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తల్లాడలోని డీసీసీబీ ఏటీఎంలో 11కార్డుల ద్వారా ఈనెల 1వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు రూ.2.80లక్షలు డ్రా చేశారు. అయితే, ఈ నగదు ఎవరి ఖాతాలో నుంచి విత్‌డ్రా కాకున్నా ఏటీఎంలోని నగదు మాయమైంది. ఈ ఘటన గురువారం వెలుగు చూడగా మేల్కొన్న అధికారులు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఏటీఎంల్లో లావాదేవీలను పరిశీలించారు. దీంతో ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం, వైరా, పెనుబల్లిల్లోని ఏటీఎంల ద్వారా కూడా గతనెల 29, ఈనెల 1న ఇదే విధానంలో రూ.లక్షల్లో నగదు డ్రా అయినట్లు గుర్తించారు. దీంతో డీసీసీబీ అధికారుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన సైబర్, సీసీఎస్, సివిల్ పోలీసులు ఏటీఎంలకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. దీంతో డబ్బులు డ్రా చేసిన వారంతా ఇతర రాష్ట్రాల వారేనని ప్రాథమికంగా తేలడంతో ముఠా సభ్యులు విడివిడిగా చోరీలకు పాల్పడినట్లుగా అంచనాకు వచ్చారు. అంతేకాక డబ్బు డ్రా చేసిన వెంటనే జమ చేసిన ఖాతాలు కేరళ, హర్యానా వాసులవి కావడంతో అక్కడి నుంచే ముఠాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఈమేరకు సీసీ టీవీల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా నిందితులు గతంలో ఎక్కడైనా ఇలాంటి చోరీలు చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

డీసీసీబీనే ఎందుకు..

నిందితులు కేవలం డీసీసీబీ ఏటీఎంలనే ఎంచుకోవడానికి గల కారణాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక్కో కంపెనీ నుంచి ఒక్కో బ్యాంకు ఏటీఎం యంత్రాలు తీసుకుంటుంది. దీంతో డీసీసీబీకి ఏటీఎంలు సమకూర్చిన కంపెనీ పరిజ్ఞానంపై మాత్రమే అవగాహన ఉండడంతో వీటిని ఎంచుకున్నట్లుగా భావిస్తున్నారు. కాగా, దర్యాప్తు ఇప్పటికే కొలిక్కి రాగా.. రెండు, మూడు రోజుల్లో నిందితులను అరెస్ట్ చేసే అవకాశముందని సమాచారం.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

ఖమ్మంవైద్యవిభాగం: సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ప్రజలు వ్యక్తిగతంగానే కాక పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్ఓ బి.మాలతి ఒక ప్రకటనలో సూచించారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశముందని పేర్కొన్నారు. ఈమేరకు దోమల నియంత్రణతోనే వ్యాధులు కట్టడి సాధ్యమవుతుందని తెలిపారు. ఇందుకోసం ప్రతీ మంగళ, శుక్రవారాలు డ్రై డేగా పాటిస్తూ నిల్వ నీటిని తొలగించాలని కోరారు. తద్వారా ఎడిస్ దోమ జీవిత చక్రానికి అంతరాయం ఏర్పడి లార్వాలు అంతరిస్తాయని పేర్కొన్నారు.


వేగంగా క్రమబద్ధీకరణ ప్రక్రియ



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాల్లో భూక్రమబద్ధీకరణ ప్రక్రియను వేగంగా చేపట్టాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ సూచించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆయన వీసీ ద్వారా జీఓలు 58, 59, 76, 118 ద్వారా దరఖాస్తు పరిష్కారం, ధరణి దరఖాస్తులపై సమీక్షించారు. జీఓ 59 కింద దరఖాస్తు చేసుకుని రూ.10లక్షలకు పైగా నగదు చెల్లించాల్సి ఉన్నా ముందుకు రాని వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఒకవేళ చెల్లించకపోతే భవన నిర్మాణాల కూల్చివేతలు ప్రారంభించాలన్నారు. అలాగే, రూ.లక్ష లోపు చెల్లించేవారు ముందుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీసీలో జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్ మాట్లాడుతూ భూక్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కారం, ధరణి పెండింగ్ దరఖాస్తులపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. వీసీలో అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్వో ఆర్.శిరీష, కల్లూరు ఆర్డీఓ సీహెచ్.సూర్యనారాయణ, తహసీల్దార్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎస్ఈ సురేందర్

చింతకాని: జిల్లా అంతటా అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్ వెల్లడించారు. మండలంలోని నాగులవంచ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో ఎస్ఈ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డీఈ నంబూరి రామారావు, ఏఈ ఉమామహేశ్వరి, లైన్ ఇన్‌స్పెక్టర్ సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

10 వేల మందికి డ్రైవింగ్ లైసెన్స్



స్లాట్ బుకింగ్ పత్రాలు అందజేస్తున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన మేయర్ నీరజ తదితరులు

● పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన మేళా
● స్లాట్ బుకింగ్‌ను ప్రారంభించిన మంత్రి అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: నియోజకవర్గ వ్యాప్తంగా 18ఏళ్లు నిండిన యువతీ, యువకులకు డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించేందుకు గాను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక మేళా ఏర్పాటు చేయించారు. ఈ మేళా ద్వారా 10వేల మందికి లెర్నింగ్ లైసెన్స్ ఇప్పించాలనేది లక్ష్యంగా చెబుతున్నారు. ఇందుకోసం మంత్రి క్యాంపు కార్యాలయంలో మీ సేవ కేంద్రాన్ని ఏర్పాటుచేయించి రోజుకు కొన్ని డివిజన్ల వారీగా యువతతో స్లాట్ బుకింగ్ చేయిస్తున్నారు. ఆతర్వాత వారు నిర్దేశిత తేదీన ఆర్టీఓ కార్యాలయంలో పరీక్షకు హాజరైతే లెర్నింగ్ లైసెన్స్ జారీ కానుంది.

మేళాను ప్రారంభించిన పువ్వాడ

నానాటికీ వాహనాల వినియోగం పెరుగుతుండగా. పలువురు ద్విచక్ర వాహనాలు, కార్లను లైసెన్స్‌లు లేకుండా నడుపుతున్నట్లు తెలుస్తోంది. పోలీసుల తనిఖీల్లో ఈ విషయం వెలుగు చూస్తుండగా అర్హులందరికీ లైసెన్స్ ఇప్పించేందుకు మంత్రి పువ్వాడ ముందుకొచ్చారు. ఈమేరకు ఖమ్మం వీడీవోస్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా మీ సేవా కేంద్రాన్ని ఏర్పాటుచేయగా మంత్రి పువ్వాడ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేళాను సద్వినియోగం చేసుకునేలా యువతీ, యువకులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జిల్లా ఆర్టీఓ మెంబర్ వి.రామారావు, డీటీఓ కిషన్‌రావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, కర్నాటి కృష్ణ, షేక్ మక్బూల్, మందడపు లక్ష్మి, పాకాలపాటి విజయ, దండా జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల పాటు..

ఖమ్మం నియోజకవర్గంలో 57 డివిజన్లతో పాటు రఘునాథపాలెం మండలంలోని యువతకు లెర్నింగ్ లైసెన్సులు ఇప్పించేలా ఏర్పాటుచేసిన మేళా రెండు నెలల పాటు కొనసాగనుంది. కాగా, లెర్నింగ్ లైసెన్స్ కోసం రూ.300 వరకు వ్యయం అవుతుండగా అందరి నగదును పువ్వాడ ఫౌండేషన్ ద్వారా చెల్లిస్తారు. కాగా, రెండు పాస్ ఫొటోలు, చిరునామా, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఒకేసారి రవాణా కార్యాలయంలో రద్దీ పెరగనుండడంతో గతంలో ఉన్న స్లాట్లను 270కి పెంచారు. కాగా, లైసెన్సు కోసం వచ్చే వారికి డ్రైవింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వడమే కాక రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించనున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు..



లెర్నింగ్ లైసెన్స్ మేళాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. రోజుకు 270 స్లాట్ల బుకింగ్‌కు అవకాశం కల్పించగా.. కార్యాలయంలోనూ రద్దీకి అనుగుణంగా కౌంటర్ల సంఖ్య పెంచాం. లైసెన్సు లేని యువత ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలి. ఈక్రమంలోనే వీరికి రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం.
– టి.కిషన్‌రావు, జిల్లా రవాణా శాఖాధికారి

యువతకు మంచి అవకాశం..



లైసెన్స్ లేకుండా వాహనం నడపాలంటే తనిఖీల్లో పట్టుబడతామనే భయం ఉంది. గతంలో పలుమార్లు లైసెన్స్ తీసుకోవాలని భావించినా సాధ్యం కాలేదు. ఇప్పుడు మేళా ఏర్పాటుచేశారని తెలియడంతో వచ్చాను. – బత్తుల త్రివేణి, ఖమ్మం



స్లాట్ బుకింగ్ కోసం వచ్చిన యువత

క్లుప్తంగా

రథయాత్ర పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఎస్ సీపీఎస్ఈయూ) ఆధ్వర్యాన చేపట్టిన పెన్షన్ సంకల్ప రథయాత్ర ఈనెల 19న జిల్లాలోకి ప్రవేశిస్తుందని జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శ్రీధర్ తెలిపారు. ఈమేరకు రథయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్లను కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాటట్లాడారు. రథయాత్ర ఈనెల 19న జిల్లాలోకి ప్రవేశించనుండగా, కల్లూరులోని జూనియర్ కాలేజీ వద్ద సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల కరుణాకర్‌తో పాటు సరిత, యరమళ్ల శ్రీనివాసరావు, బంగారయ్య, జిలానీ, నెల్లూరి రవికుమార్, కుమార్, లవన్‌కుమార్, రత్నం పాల్గొన్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్‌స్టేడియంలో జరుగుతున్న రెండు రాష్ట్రాల స్థాయి పురోహితుల క్రికెట్ టోర్నీ శుక్రవారం క్వార్టర్ ఫైనల్స్ దశకు చేరింది. మూడో రోజు మొదటి మ్యాచ్‌లో నర్సీపట్నం జట్టు గుడివాడపై, ఖమ్మం పరమేశ్వర జట్టు అన్నవరంపై, హైదరాబాద్ జట్టు నూజివీడుపై, వరంగల్ వంశీ వారియర్స్ జట్టు బాపట్లపై, ఖమ్మం స్తంభాద్రి జట్టు విజయనగరంపై, అన్నవరం జట్టు హైదరాబాద్‌పై, ఖమ్మం పరమేశ్వర జట్టు నూజివీడు జట్టుపై గెలుపొందాయి. కాగా, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేందర్ సింగ్ ధోని జనదినం సందర్భంగా నిర్వాహకులు కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో సాయినాథ్, ప్రశాంత్, దిలీప్, అనిరుధ్, ప్రదీప్, మతిన్, సాంబమూర్తి పాల్గొన్నారు.

కూనంనేని అరెస్టుపై సీపీఐ నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఖమ్మంలో ప్రదర్శన నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు ప్రదర్శనగా వెళ్లి ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈసందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యాన హనుమకొండ వెళ్లిన కూనంనేని సాంబశివరావును అరెస్టు చేయడం గర్హనీయమన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన ఏ హామీని నెరవేర్చని మోదీని నిలదీసేందుకు వెళ్తే అరెస్టు చేయడం సరికాదని, ఈమేరకు నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తో పాటు జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతా దేవి, శింగు నర్సింహారావు. పోటు కళావతి, మహ్మద్ సలాం, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, యానాలి సాంబశివరెడ్డి, ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, నిమ్మతోట రామకృష్ణ, ఏటు, మద్దోజు శ్రావణ్, సైదా, యమాల గోపాలరావు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కొణిజర్ల: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కొణిజర్ల ఎస్‌ఐ శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడలంలోని పెద్దమునగాలకు చెందిన ఐలపోగు గురవయ్య (55) కొణిజర్లలో శుక్రవారం పురుగుల మందు కొనుగోలు చేసి గోపవరం - దిద్దుపూడి మధ్య తాగాడు. ఈ విషయాన్ని గమనించిన గోపవరం గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ చేరుకునే సరికి ఆయన మృతి చెందడంతో పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉండగా, ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

ఐపీ దాఖలు చేసిన కిరాణం వ్యాపారి

ఖమ్మం లీగల్: ఖమ్మంకు చెందిన కిరాణ వ్యాపారులైన భార్యాభర్తలు గారెపల్లి అశోక్‌కుమార్, మౌనిక రూ.34.40 లక్షలకు శుక్రవారం దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశారు. నగరంలో కిరాణం షాపు నిర్వహించిన వారు పలువురి వద్ద అప్పులు చేశారు. అవి తీర్చే మార్గం లేక 15 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదుల ద్వారా ఐపీ దాఖలు చేశారు.

రూ.13.85 లక్షలకు...

ఖమ్మం రూరల్ మండలం ఎడ్లపాడుకు చెందిన శారీ సెంటర్ యజమానులైన దంపతులు భోగ శోభ, సత్యనారాయణ రూ.13.85లక్షలకు గాను సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం న్యాయవాదుల ద్వారా ఐపీ దాఖలు చేశారు. ఇందులో శోభ శారీ సెంటర్, లేడీస్ టైలర్ నడపగా, సత్యనారాయణ ఆటోడ్రైవర్‌గా పని చేసేవాడు. ఈక్రమంలో పెరిగిన అప్పులు తీర్చే మార్గం లేక ఐపీ దాఖలు చేశారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బస్సు

ఖమ్మంక్రైం: ఖమ్మం డిపోకు చెందిన అద్దె బస్సు శుక్రవారం అదుపుతప్పి జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాం వద్ద డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. ఒక్కసారిగా స్టీరింగ్ మొరాయించడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. అయితే, బస్సులోని కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలే కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

ఇప్పటికే ఆలస్యమైంది..!

ఈ ఏడాది మొదలుకాని హరితహారం

- మున్సిపాలిటీల్లోని నర్సరీల్లోనే ఎదుగుతున్న మొక్కలు
- ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో 15.09 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళిక
- వర్షాలు కురుస్తుండడంతో ఈ నెల 14న ప్రారంభించేందుకు సన్నాహాలు



ఇల్లెందులోని మున్సిపల్ నర్సరీలో సిద్ధంగా ఉన్న రకరకాల పూల మొక్కలు

ఇల్లెందు: ఏటా జూన్ మొదటి, రెండో వారాల్లో మొదలయ్యే హరితహారం ఈసారి ఆలస్యమవుతోంది. ఇప్పటివరకు సరైన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అయితే వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్న నేపథ్యాన వచ్చే వారం నుంచి హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీల్లోని నర్సరీల్లో ఇప్పటికే మొక్కలు సిద్ధం చేశారు. కాగా, వర్షాల ఆలస్యంతో హరితహారం కూడా జాప్యం జరుగుతుండడంతో మొక్కలు నర్సరీల్లోనే ఏపుగా పెరుగుతున్నాయి.

ఏటా పండుగ వాతావరణంలో..

గతంలో హరితహారం పండుగ వాతావరణంలో నిర్వహించేవారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపిక చేసిన ప్రాంతాల్లో మొక్కలు నాటడం ఉత్సాహంగా జరగగా.. గతేడాది హంగూ ఆర్భాటం లేకుండానే కార్యక్రమం కానిచ్చేశారు. ఇక ఈసారి తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గత నెల 19న అక్కడక్కడా మొక్కలు నాటారు. కానీ, పూర్తిస్థాయిలో కార్యక్రమాన్ని వచ్చే వారం మొదలుపెట్టే అవకాశముందని సమాచారం.

పూల మొక్కలకే ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో హరితహారం ఒకటి. కొన్నేళ్లుగా నీడనిచ్చే మొక్కలకే ప్రాధాన్యత ఇచ్చారు. కొన్ని సార్లు గృహస్తులకు పండ్ల మొక్కలను పంపిణీ చేయడంతో పాటు కాలనీల్లో అంతర్గత రహదారుల వెంట కూడా నాటారు. కానీ, ఈసారి మాత్రం ఎక్కువగా పూల మొక్కలపైనే దృష్టి సారించారు. ముఖ్యంగా పట్టణాల్లో స్థలాల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో నర్సరీల కోసం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిధులు విడుదల చేయగా అనువైన స్థలాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్లు వేసి మొక్కలు పెంచారు. ఆయా కాంట్రాక్టర్లు మొక్కలను సిద్ధం చేయడంతో త్వరలోనే హరితహారం కింద నాటేందుకు కసరత్తు చేపట్టారు.

కార్పొరేషన్/ మున్సిపాలిటీ	మొక్కల లక్ష్యం	సిద్ధంగా ఉన్న మొక్కలు
ఖమ్మం	5,84,540	3,04,100
కొత్తగూడెం	1,82,490	1,44,300
పాల్వంచ	2,27,260	88,000
మణుగూరు	1,59,610	45,000
సత్తుపల్లి	1,06,590	64,100
మధిర	93,940	93,940
వైరా	75,900	65,900
ఇల్లెందు	79,420	98,000
మొత్తం	15,09,750	9,03,340



ఏపుగా పెరిగిన నీడనిచ్చే మొక్కలు

ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు



ఇప్పటి వరకు నీడ, పండ్ల మొక్కలనే నాటాం. ఈసారి మాత్రం పూల మొక్కలకు ప్రాధాన్యత ఉంటుంది. ఇప్పటికే నర్సరీలో నాటేందుకు పూల మొక్కలు సిద్ధం చేశాం. ప్రతీ ఇంటికి ఆరేసి మొక్కలు అందజేస్తాం. తద్వారా గృహ యజమానులు ఆసక్తిగా ముందుకొస్తారని, స్థలాల సమస్య కూడా ఉండదని చెప్పాలి. చామంతి, మందారం, మల్లె, లిల్లీ, గులాబీ, తులిష్, కనకాంబరం వంటి మొక్కలను పంపిణీ చేయడంతో పాటు సామూహిక స్థలాల్లో నాటనున్నాం.

–అంకుషావలీ, మున్సిపల్ కమిషనర్, ఇల్లెందు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ

ఇంటర్‌మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు గతంతో పోలిస్తే మరింత మెరుగైన మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు అభినందించాయి.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రసాద్, తదితరులు

న్యూవిజన్ విజయదుందుభి

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయదుందుభి మోగించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ తెలిపారు. ఎంపీసీలో ఎం.పవన్‌కుమార్, ఎనమోహన్ ఆదిత్య, ఎస్.డీ.శాభాషా, టి.శ్రీ విద్యాత్, టి.భవతి 470కి 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలోనే అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. అలాగే, ఆర్.సమ్రీన్, బి.సాయి లేఖ, ఎం.నమిత, ఎస్.వెంకట సాయి అభిరామ్, పి.జాన్వీ, ఎం.వర్షిత, కె.మహాలక్ష్మి, పి.భవ్యశ్రీ 466మార్కులు సాధించగా, బైపీసీలో ఎస్.కే.రుహిఅంజుమ్, ఇ.జగృతిపవార్ 440కి 434మార్కులు, సీహెచ్.శ్రీవరుణ్, పి.జ్యోతి, ఎస్.అఖిల 433, మిని హాజీరా, కె.జశ్వంత్‌రామ్ 432 మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు గోపీచంద్, సీహెచ్.కార్తీక్, ప్రిన్సిపాళ్లు బ్రహ్మచారి, శ్రీనివాసరావు వారిని అభినందించారు.

హార్వెస్ట్ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులకు గణనీయంగా మార్కులు పెరగగా అగ్రస్థానంలో నిలిచారని హార్వెస్ట్ విద్యాసంస్థల చైర్మన్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డిలు తెలిపారు. తమ విద్యార్థి బి.గణేష్ గౌతమ్ 470కి 466మార్కులు, ఎస్.సంధ్య 464మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలవగా, వివిధ సబ్జెక్టుల్లో వంద శాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్థులను చైర్మన్, ప్రిన్సిపాల్ అభినందించగా అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్జేసీకి అత్యుత్తమ ఫలితాలు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ కృష్ణ

ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చూటారని ఆర్జేసీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీపీసీలో యు.హారిక 470కి 465 మార్కులతో రాష్ట్ర స్థాయి మూడో ర్యాంకు, హెచ్.కార్తికేయ 464 మార్కులతో నాలుగో ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. ఒత్తిడి లేని విద్య అందిస్తుండటంతోనే రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈమేరకు చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీపతి, ఇన్‌చార్జ్ టి.ఉపేందర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.లింగయ్య, వెంకటరెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

రెజొనెన్స్ సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని రెజొనెన్స్ కళాశాల డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. ఎంపీసీలో పి.నందిని 470మార్కులకు 467మార్కులు, ప్రసన్న 466, కె.నిహారిక 466, జి.చంద్రశేఖర్ 465, ఎం.రాకేష్ సుశాంత్ 465, పి.సాయితేజ 465. వి.విఘ్నేష్ 465, ఎంహైమావతి 464, జి.సింధు 464, సీహెచ్.హాసిని 464, డి.విజయదుర్గ, ఎ.త్రిష 464మార్కులు సాధించారన్నారు. అలాగే, బైపీసీలోనూ పలువురు అత్యధిక మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్థులను డైరెక్టర్లతో పాటు ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి అభినందించారు.

వెలాసిటీ ప్రభంజనం



విద్యార్థిని అభినందిస్తున్న వెలాసిటీ యజమాన్యం లక్ష్మణ్‌రావు, తదితరులు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని వెలాసిటీ కళాశాల చైర్మన్ శెట్టి లక్ష్మణ్‌రావు, సెక్రటరీ, కరస్పాండెంట్ మల్లోలు రవి, అకడమిక్ డీన్ మహ్మద్ యాకూబ్, ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు తెలిపారు. ఎంపీసీలో 470కి ఎం.హిమజ శ్రీప్రియ 467మార్కులు, ఏ.నిహారిక 466మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, పలువురు అత్యుత్తమ మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఆయా విద్యార్థులను అభినందించారు.

అమ్మ కావాలి...

- కన్నీరుమున్నీరుగా రోదిస్తున్న నాలుగేళ్ల చిన్నారి
- రోడ్డుప్రమాదంలో మృతి చెందిన తల్లిదండ్రులు



రోదిస్తున్న లక్ష్మీకార్తీక

మధిర: 'నాకు అమ్మ కావాలి.. అమ్మను చూపించండి.. అప్పుడే సిరప్ తాగుతాను' అంటూ చిన్నారి రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టిస్తోంది. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు మృతి చెందిన విషయం ఆ చిన్నారికి చెప్పలేక... చికిత్స ఎలా చేయించాలో తెలియక బంధువులు సతమతమవుతున్నారు. మధిరకు చెందిన సిద్ధంశెట్టి రాధాకృష్ణ (38), లీలారాణి(32) దంపతులకు నాలుగేళ్ల కుమార్తె లక్ష్మీకార్తీక ఉంది. కొన్నేళ్లుగా మధిరలో పాన్ షాపు నిర్వహించిన రాధాకృష్ణ విజయనగరానికి చెందిన లీలారాణిని పెద్దల అంగీకారంతో ప్రేమ వివాహం చేసుకున్నాడు. కుటుంబం మధిరలో నివసిస్తుండగా ఆయన ఖమ్మంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిద్ర చేసేందుకు రాధాకృష్ణ తన భార్య, కుమార్తెతో కలిసి గురువారం వెళ్తుండగా చిల్లకల్లు- వైరా ప్రధాన రహదారిపై వెనక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో దంపతులు మృతి చెందాడు. ఈ ఘటన నుంచి గాయాలతో బయటపడిన లక్ష్మీకార్తీక మృతదేహాలపై పడి రోదిస్తుండగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆమె కాలు ఫ్రాక్చర్ కాగా, మందులు వేసుకోవాలని ఎందరు సూచించినా తల్లిని చూపించాలని అడుగుతుండడంతో ఏం సమాధానం చెప్పాలో తెలియక వారు కన్నీరు పెడుతున్నారు. కాగా, రాధాకృష్ణ, లీలారాణి మృతదేహాలకు జగ్గయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి మధిరకు తీసుకొచ్చారు. అలాగే, లక్ష్మీకార్తీకను కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోనా ధనికుమార్, శ్రీనివాస్, సిద్ధంశెట్టి సందీప్ తదితరులు పరామర్శించి విషయాన్ని సీఎల్పీ నేత భట్టికి ఫోన్‌లో చెప్పగా ఆయన వైద్యులతో చికిత్సపై ఆరా తీశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ



జెండాను ఆవిష్కరిస్తున్న మంద కృష్ణ

ఖమ్మంమామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించడం ద్వారా చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఖమ్మం సిటీ బస్టాండ్ ఎదురుగా జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం మంద కృష్ణ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేయగా ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ తొమ్మిదేళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాగా, ఈ నెల మూడో వారంలో హైదరాబాద్‌లో 20 లక్షల మందితో నిర్వహించనున్న బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు తూరుగంటి అంజయ్య, భవానీ చౌదరి, మాచర్ల క్రాంతి, రాము, నర్సింహారావు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, జీవరత్నం, గోపాల్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గు సరఫరా చేయండి..

కిష్టారం ఓసీలో తనిఖీ చేసిన జీఎం

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ ద్వారా నాణ్యమైన బొగ్గును అవసరమైన సంస్థలకు సరఫరా చేయాలని కొత్తగూడెం జీఎం షాలెం రాజు సూచించారు. ఓసీని శుక్రవారం తనిఖీ చేసిన ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణా తదితర అంశాలపై పీఓ నర్సింహారావు, అధికారులతో సమీక్షించారు. రోజుకు 8వేల టన్నులకు తగ్గకుండా నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడమే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలని తెలిపారు. వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం సీహెచ్‌పీని సందర్శించి రక్షణ చర్యలపై సూచనలు చేశారు. అధికారులు రమణారావు, బాబు, గోపి, విక్రమ్‌బాబు, విజయ్, మాధవరావు, జగదీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి

ముదిగొండ: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని వల్లాపురానికి చెందిన యండ్రపల్లి మాధవరావు(53) శుక్రవారం గేదెలను మేపడానికి వెళ్లాడు. ఈక్రమంలో గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిన ఆయన నీట మునిగి మృతి చెందాడు. ఘటనపై ఆయన సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లేలోగా ఎదురొచ్చిన మృత్యువు

- గంజాయి మత్తులో పొడిచిన యువకుడు
- ఆస్పత్రికి వెళ్లేలోగా పంపింగ్ వెల్ రోడ్డు వాసి మృతి
- నిందితులిద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు



కొప్పుల సాయిపవన్ (ఫైల్)

ఖమ్మంక్రైం / ఖమ్మంమామిళ్లగూడెం: మరో అర గంటలో దైవదర్శనానికి బయలుదేరాలని భావించిన ఆ యువకుడికి మృత్యువు ఎదురైంది. గంజాయి మత్తులో ఉన్న ఓ వ్యక్తి విచక్షణారహితంగా ప్రవర్తించడంతో నిండు ప్రాణం బలైంది. ఖమ్మంలోని పంపింగ్ వెల్ రోడ్డులో గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పంపింగ్‌వెల్ రోడ్డుకు చెందిన కొప్పుల సాయి పవన్(23) చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన తన స్నేహితులతో కలిసి అశ్వారావుపేట సమీపాన గుబ్బలమంగమ్మ తల్లి దర్శనానికి బయలుదేరాని నిర్ణయించుకున్నారు. ఈమేరకు గురువారం రాత్రి 10.50 గంటల సమయాన ఆయన తన ఇంటి ఎదుట రోడ్డుపై స్నేహితులు బాలిన సాయి, జి.సూర్యతో కలిసి ఉండగా, సుందరయ్య నగర్‌కు చెందిన అఖిల్ ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ రోడ్డుపై ఎందుకు ఉన్నారని దూషించాడు. మళ్లీ కాసేపటికి వచ్చిన అఖిల్ వారి వద్ద ద్విచక్ర వాహనం నిలిపి అసభ్యంగా దూషిస్తుండగా సాయిపవన్ ప్రశ్నించాడు. దీంతో అఖిల్ అశోక్.. సాయిపవన్‌ను పట్టుకోగా అఖిల్ సర్జికల్ కత్తితో గుండె, పొట్టపై పొడిచాడు. ఈక్రమంలో సాయిపవన్‌ను రక్షించేందుకు బాలిన సాయి అడ్డు రాగా ఆయనపై కూడా దాడికి దిగాడు. దీంతో స్నేహితులు వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. కొప్పుల సాయిపవన్ మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఆతర్వాత బాలిన సాయిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పోలీసులు చూస్తుండగానే...

గంజాయి మత్తులో ఉన్న అఖిల్ సైకోలా ప్రవర్తించాడని, అడ్డుగా వచ్చిన వారిని సైతం భయపెట్టాడని స్థానికులు తెలిపారు. కరాటే వచ్చిన అఖిల్ తొలుత నాన్ చాక్‌తో దాడి చేస్తుండగా లాక్కున్నారు. అనంతరం తన స్నేహితుడు అశోక్‌కు ఫోన్ చేసి కత్తి తెమ్మనంతో ఆయన రాగానే కత్తితో సాయిపవన్, ఆయన స్నేహితుడు సాయిపై దాడిచేశాడు. కాగా, ఘర్షణ సమాచారం అందుకున్న పెట్రోలింగ్ పోలీసులు ఇద్దరు చేరుకున్నా ఎవరినీ అడ్డుకోలేదని చెబుతున్నారు. అలాగే, తీవ్రంగా గాయపడిన సాయిపవన్ అర గంట పాటు అక్కడే పడి ఉన్నా ఆస్పత్రికి తరలించడానికి కూడా పోలీసులు ముందుకు రాలేదని సమాచారం. ఇవరకు అఖిల్, అశోక్‌ను స్థానికులే పట్టుకోగా వారిని తీసుకెళ్లారని తెలుస్తోంది. పోలీసుల ట్యాబ్‌లో ఘర్షణను వీడియో తీస్తుండగా సాయిపవన్ బంధువులు కాపాడాల్సింది పోయి వీడియో తీయడం ఏమిటని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే, అఖిల్, సాయిపవన్‌కు మధ్య గతంలో ఏమైనా గొడవలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు. అంతేకాక అఖిల్‌కు గంజాయి ఎలా వచ్చిందని కూడా ఆరా తీస్తున్నారు. ఘటనపై సాయిపవన్ సోదరుడు తరుణ్ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి అఖిల్, అశోక్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, సాయిపవన్ తండ్రి శ్రీను ఇటీవల మృతిచెందగా.. ఇప్పుడు కుమారుడు కూడా మృతి చెదడంతో తల్లి బేబమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

నివాళులర్పించిన బీజేపీ నేతలు

మృతుడు కొప్పుల సాయిపవన్ బీజేపీ యువమోర్చా త్రీటౌన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, నాయకులు డాక్టర్ శీలం పాపారావు, రుద్ర ప్రదీప్ తదితరులు నివాళులర్పించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు అల్లిక అంజయ్య, లక్ష్మీనారాయణగుప్త, అనంతు ఉపేందర్‌గౌడ్, వెంకట్ ,రుద్రప్రతాప్, మోహన్‌రెడ్డి, దీకొండ శ్యాం పాల్గొన్నారు. కాగా, సాయి తల్లిని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు ఫోన్‌లో పరామర్శించారు.

జోరుగా కోడి పందేలు

- గంగదేవిపాడులో పట్టపగలే జూదం
- రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం



కోడిపందేలకు వచ్చిన వారి వాహనాలు

పెనుబల్లి: మండలంలోని గంగదేవిపాడు గ్రామంలో శుక్రవారం పట్టపగలు కోడిపందేలు నిర్వహించారు. వందలాది పాల్గొని పందేలు కాయగా... పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది. గ్రామంలోని కోడి పందేల నిర్వాహకులు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన జూదరులకు సమాచారం ఇచ్చి ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పందెం నిర్వహించారు. ఈ తతంగం బహిరంగంగానే జరుగుతూ రూ.లక్షల్లో చేతులు మారుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం. గంగదేవిపాడులో వారానికి ఒకసారైనా కోడిపందేలు నిర్వహిస్తున్నందున పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా, వందలాది మంది పందెంలో పాల్గొన్నట్లు అక్కడి వాహనాలను చూస్తే తెలిసిపోతున్నా పోలీసులు మాత్రం ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించడం కొసమెరుపు. ఈ సందర్భంగా సదరు వ్యక్తి నుంచి రూ.10 వేల నగదు, నాలుగు పందెం కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.సూరజ్ తెలిపారు.